క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): సాతెల్లి గ్రామానికి చెందిన బేస్త దుర్గయ్యకు ఎస్సై గణేష్ బుధవారం సెల్ ఫోన్‌ను అందించారు. దుర్గయ్య తన ఫోన్ పోగొట్టు కోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీ గుర్తించి బాధితుడికి అప్పగించారు.

కనీస అభ్యసన సామర్థ్యాలను నేర్పించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): విద్యార్థులకు కనీస అభ్యసన సామర్థ్యాలను నేర్పించాలని ఎంఈవో రామస్వామి అన్నారు. తాడ్వాయి ఎమ్మార్సీ భవనంలో బుధవారం ప్రధానోపాధ్యాయుల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్క విద్యార్థి తెలుగు, ఆంగ్లం, గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రంలపై కనీస అవగాహన కల్పించాలన్నారు. 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ప్రత్యేక పరీక్ష నిర్వహించారు. హెచ్‌ఎం సంగారెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజాగౌడ్, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్లారెడ్డి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ యూనియన్ కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సీపీఎస్ రద్దు, ప్రమోషన్లలో గల అడ్డంకుల తొలగింపు, పెండింగ్ బిల్లు మంజూరు కోసం కృషి చేస్తామని అన్నారు. పీఆర్‌టీయూ జిల్లా నాయకులు కమలాకర్, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

రిటర్నింగ్ కార్యాలయం పరిధిలో 144 సెక్షన్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం పరిధిలోని వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మన్నె ప్రభాకర్ బుధవారం తెలిపారు. ఈ నెల 3 నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 13న నామినేషన్ల పరిశీలన, 15న నామినేషన్ల ఉప సంహరణ ఉంటుందని అన్నారు. రిటర్నింగ్ కార్యాలయం పరిధిలోని వంద మీటర్ల దూరంలో దుకాణాలు, హోటళ్లు, జిరాక్సు సెంటర్లు తెరిచి ఉంచరాదని అన్నారు.

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఎంపీ బీబీ పాటిల్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. నాయకులు దుర్గారెడ్డి, మనోహర్, రమేష్ గౌడ్, కమ్మరికత్త అంజయ్య, వెంకటేశం, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ



కామారెడ్డి అర్బన్: ఎంపీ బీబీ పాటిల్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు అతిమాముల రామకృష్ణ గుప్తా, స్థానిక అనాథ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, ఇతర దినుసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రమేష్ గుప్తా, రాచర్ల శ్రీకాంత్, దిలీప్, లెగ్గల రాజు, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపి శిబిరం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతి రోజు దివ్యాంగ పిల్లలకు ఇంటి దగ్గర వ్యాయామాలు చేయించాలని పిల్లల తల్లిదండ్రులకు ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి సూచించారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సీలో ఎంఈవో దేవి సింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్ నిర్వహించారు. దివ్యాంగ పిల్లలతో వ్యాయమాలు చేయించారు. అనంతరం తల్లిదండ్రులకు వ్యాయామాల గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు విఠల్, ఏస్ రాందాస్, రాథోడ్ బలరాం, కంప్యూటర్ ఆపరేటర్ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు స్వస్తి పలకాలి

- ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం
- ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ రావు
- కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు



సదాశివనగర్‌లో మాట్లాడుతున్న మదన్ మోహన్



మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ధర్మారెడ్డి, కన్నారెడ్డి గ్రామస్తులు

సదాశివనగర్/లింగంపేట/నాగిరెడ్డిపేట: కేసీఆర్ కుటుంబ పాలనకు ప్రజలు స్వస్తి పలకాలని ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ రావు అన్నారు. బుధవారం సదాశివనగర్, నాగిరెడ్డిపేట, లింగంపేట మండలాల పరిధిలో ఆయన పర్యటించారు. నాగిరెడ్డిపేట మండలంలోని ధర్మారెడ్డి గ్రామ సర్పంచ్ శ్రీధర్‌గౌడ్, లింగంపేట మండల కేంద్రానికి చెందిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ మాకం రాములుతో పాటు పలు గ్రామాల ప్రజలు మదన్ మోహన్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన జాజాల సురేందర్ బీఆర్‌ఎస్‌కు అమ్ముడు పోయి, నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. సురేందర్‌కు ఈ ఎన్నికలో డిపాజిట్ కూడా దక్కదని జోస్యం చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తుందని, ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వచ్చి కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని భరోసా ఇచ్చారు.

దోచుకునే పార్టీలను నమ్మొద్దు

- జుక్కల్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి అరుణ తార



ఫత్లాపూర్‌లో మాట్లాడుతున్న అరుణ తార

బిచ్కుంద(జుక్కల్): ప్రజాధనాన్ని దోచుకొని దాచుకునే పార్టీలను నమ్మవద్దని జుక్కల్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే అరుణతార అన్నారు. బుధవారం కార్యకర్తలతో కలిసి ఫత్లాపూర్‌లో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అరుణతార మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే రాష్ట్రం అభివృద్ధి దిశలో పయనిస్తుందని, బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ పాలించినప్పుడు రాష్ట్ర ఖజానాను దోచుకున్నారు.. కేసీఆర్ పదేళ్లలో కుటుంబ పాలన కొనసాగించి తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చారని ఆరోపించారు. జుక్కల్ నియోజక వర్గంలో అభివృద్ధి జరిగింది ఏమీ లేదని, ఓటర్లు ఈ సారి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని కోరారు. గతంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వేసిన రోడ్లకు నేటి వరకు రోడ్డు వేయలేదని, ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సారి బీజేపీకి అవకాశం కల్పించాలని కోరారు. నేతలు కిష్టారెడ్డి, ఎధర్ పంతులు, పండరి జాదవ్ తదితరులున్నారు.

మోసం చేసి ఓట్లు ఎలా అడుగుతారు



అన్నారంలో ప్రచారం చేస్తున్న కైలాస్ శ్రీనివాస్



కామారెడ్డి పట్టణంలో..

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్

రామారెడ్డి (ఎల్లారెడ్డి): ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసి రైతు రుణ మాఫీ చేయకుండా గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను ఎలా ఓట్లు అడుగుతారని బీఆర్‌ఎస్ నాయకులను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కై లాస్ శ్రీనివాస్ ప్రశ్నించారు. బుధవారం అన్నారంలో మైనార్టీ సెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ ఎండీ సల్మాన్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీ విభాగం జనరల్ సెక్రెటరీ సల్మాన్, తదితరులు పాల్గొన్నారు

పట్టణంలో జోరుగా కాంగ్రెస్ ప్రచారం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం జోరుగా ప్రచారం చేశారు. పట్టణంలోని 21, 22వ వార్డుల్లో ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్‌ను గెలిపించాలని సీడీసీ మాజీ చైర్మన్ కారంగుల అశోక్‌రెడ్డి ఓటర్లను కోరారు. కౌన్సిలర్ పాత శివ కృష్ణమూర్తి, పండ్ల రాజు, మాజీ కౌన్సిలర్ బట్టు మోహన్ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు పోటీగా వస్తే గంప కింద కమ్ముడే



దోమకొండలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్



పాతరాజంపేట సమీపంలో క్రికెట్ జోన్ ప్రారంభిస్తూ..

- దోమకొండను మున్సిపాలిటీ చేసి డిగ్రీ కాలేజీ ఇవ్వండి
- మంత్రికి గంప గోవర్ధన్ విన్నపం

భిక్కనూరు/దోమకొండ: కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌కు పోటీగా ఎవరొచ్చినా వారిని గంప కింద కమ్ముడేనని కామారెడ్డి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. బుధవారం భిక్కనూరు, దోమకొండ మండల కేంద్రాల్లో జరిగిన మంత్రి కేటీఆర్ సభల్లో ఆయన మాట్లాడారు. గతంలో తనతో పోటీపడిన మాజీ మంత్రి షబ్బీర్‌అలీతో పాటు బీజేపీ నాయకులు ఓడిపోయారన్నారు. పాత తాలుకా కేంద్రమైన దోమకొండ మండల కేంద్రాన్ని మున్సిపాలిటీ చేయాలని కోరారు. అదేవిధంగా దోమకొండలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రాంతానికి కాళేశ్వరం నీటిని తీసుకురావాలని కోరారు. బీబీపేట మండల శివారులోని కూడవెళ్లి వాగు నుంచి లిఫ్టుల ద్వారా ఆరు గ్రామాలకు సాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ షేరీ సుభాష్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త సుభాష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పరికి ప్రేంకుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ జోన్ ఏర్పాటు అభినందనీయం

కామారెడ్డి అర్బన్: క్రికెట్ క్రీడపై ఆసక్తిగల వారికి క్రమపద్ధతితో కోచింగ్ ఇవ్వడానికి కామారెడ్డిలో క్రికెట్ శిక్షణ కేంద్రం క్రికెట్ జోన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. బుధవారం పాతరాజంపేట సమీపంలో క్రికెట్ జోన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ జోన్ నిర్వాహకులు వేదకాంత్, ప్రశాంత్‌రెడ్డి, షోయబ్‌లను ప్రభుత్వ విప్ అభినందిచారు. నాయకులు కే.తిర్మల్‌రెడ్డి, రమేష్ గుప్తా, నారాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించాలి



కామారెడ్డి టౌన్: తెలంగాణ రాజకీయ పార్టీలు దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక డిక్లరేషన్, సంక్షేమ పథకాలను ప్రకటించాలని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్ప దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు పక్కా ఇళ్లు, ఉచిత విద్యుత్, రవాణ సౌకర్యం, జీవితా బీమా, దివ్యాంగుల బంధు పథకం, వివాహ ప్రోత్సాహాలు, ఉచితంగా మోటరైజ్‌డ్ వాహనాలను ఇవ్వాలని కోరారు. దివ్యాంగ నాయకులు పంగ ఈశ్వర్, నర్సింలు ఉన్నారు.

కేసీఆర్ పోటీ చేయడం కామారెడ్డి ప్రజల అదృష్టం

మాచారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గం నుంచి కేసీఆర్ పోటీ చేయడం నియోజకవర్గ ప్రజల అదృష్టమని మాచారెడ్డి జెడ్పీటీసీ మినుకూరి రామ్‌రెడ్డి అన్నారు. బుధవారం చుక్కాపూర్ గ్రామ మినుకూరి మోటాటి రెడ్డి సంఘం సభ్యులు సీఎం కేసీఆర్‌కు తప్ప ఇతరులకు ఓటు వేయమని తీర్మానం చేశారు. రెడ్డి సంఘం ప్రతినిధులు బాల్ రెడ్డి, మల్లారెడ్డి, సురేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

మహిళా సంఘాలలో ఆడిట్

రాజంపేట: రాజంపేట మండల మహిళ సమాఖ్య భవనంలో డీపీఎం సుధాకర్, డీఎంజీ రామచంద్ర గౌడ్ ఆధ్వర్యంలో 22 గ్రామ సంఘాల అన్ని పుస్తకాలను అంతర్గత ఆడిట్ నిర్వహించారు. గ్రామ సంఘం పుస్తకాలను రాయడంలో మార్పులు చేర్పులను గ్రామ సంఘ అసిస్టెంట్లకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం సాయిలు, సీసీలు శ్రీనివాస్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

యాసంగి పంటల సాగుపై అవగాహన



గాంధారి(ఎల్లారెడ్డి): యాసంగి పంటల సాగుపై పొతంగల్ కలాన్ రైతు వేదిక భవనంలో బుధవారం రైతులకు అవగాహన కల్పించినట్లు ఏవో నరేష్ తెలిపారు. యాసంగిలో మొక్కజొన్న, జొన్న, శనగ, గోధుమ, పొద్దుతిరుగుడు తదితర పంటల విత్తన శుద్ధి, సాగుపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కామారెడ్డి జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త అనీల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

కామారెడ్డి : రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల క్రితం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తాతో కలిసి వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన వీడియో ప్రదర్శించి, చేసిన మోసాన్ని గుర్తు చేశారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలని, బీఆర్‌ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. నాయకులు విశ్వనాధుల మహేష్ గుప్తా, గోలి శ్రీనివాస్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న స్పీకర్ పోచారం



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: తిరుమల తిరుపతిలో కొలువైన వేంకటేశ్వర స్వామిని బుధవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు దర్శనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. కోరిన కోర్కెలు తీర్చే కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. మొక్కు తీర్చుకోవడానికి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల వచ్చామని, లోక కళ్యాణం ముఖ్యమని, ప్రజలందరూ సుఖసంతోషాలతో చల్లగా ఉండాలని దేవున్ని కోరుకున్నట్లు తెలిపారు. వర్షాలు బాగా కురిసి పంటలు పండి సుభిక్షంగా ఉంచే విధంగా ఆశీర్వదించాలని ప్రార్థించినట్లు వివరించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ దంపతులు పోచారం భాస్కర్‌రెడ్డి, సోనిరెడ్డి తదితరులు ఉన్నారు.

పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు

- ఎమ్మెల్యే జాజాల సురేందర్



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరినట్లు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం మూడో సారి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. సర్పంచ్ అనిల్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, ఎంపీటీసీ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: పట్టణంలోని 3వ వార్డుకు చెందిన మైనార్టీ నాయకులు, వెంకటాపూర్, అడివిలింగాల, గండిమాసానిపేట గ్రామాలకు చెందిన మహిళలు, యువకులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ తదితరులున్నారు.

ఉప సర్పంచ్‌లకు గౌరవ వేతనమివ్వాలి



కేటీఆర్‌తో కరచాలనం చేస్తున్న బోడ నరేష్



దోమకొండలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

దోమకొండ/భిక్కనూరు: దోమకొండ, భిక్కనూరు మండల కేంద్రాల్లో జరిగిన మంత్రి కేటీఆర్ బహిరంగ సభలో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు బుధవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి కేటీఆర్, పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. భిక్కనూరు సభలో కేటీఆర్‌కు సర్పంచ్ తున్కి వేణు, తల్వార్‌ను బహూకరించడంతో ఆయన దానిని పట్టుకుని కార్యకర్తలను ఉత్తేజపరిచారు. సర్పంచ్‌ల మాదిరిగానే ఉపసర్పంచ్‌లకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వాలని ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బోడ నరేష్, మంత్రి కేటీఆర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

ఆర్యవైశ్యులను తప్పుదోవ పట్టించొద్దు



కామారెడ్డి : కొందరు బీజేపీ వర్గానికి చెందిన ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఆర్యవైశ్యులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆ సంఘం జిల్లా నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండిపడ్డారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారని తెలిపారు. కానీ కొందరు నాయకులు అసత్యపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముప్పారపు ఆనంద్, కాంశెట్టి, గౌరి శంకర్, రమేష్ గుప్తా, రామకృష్ణ, తృప్తి అనిల్, లక్ష్మణ్ తదితరులున్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ



బాన్సువాడ రూరల్: ఎన్నికలను పురస్కరించుకుని బూత్ లెవెల్ అధికారులతో బుధవారం బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాను అన్ని పోలింగ్ సెంటర్లలో ప్రచురించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన ఫారం–6, 7, 8లను పరిష్కరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎన్నికల సంఘం ప్రకటించిన తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ వరప్రసాద్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



కొమలంచలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ సీఈవో



పేట్‌సంగెంలో ..

నిజాంసాగర్(జుక్కల్): రైతులు పండించిన వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని గున్కుల్ సొసైటీ సీఈవో రాములుసేట్ అన్నారు. బుధవారం కొమలంచలో గున్కుల్ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సొసైటీ సిబ్బంది కిరణ్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు బ్రాహ్మణ్‌పల్లి, గుర్జాల్, మాతుసంగెం, పేట్ సంగెం గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఏవో నరేష్ తెలిపారు. కార్యక్రమంలో విండో సీఈవో మోహన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

17 శాతం తేమ ఉండేలా ఆరబెట్టాలి



పెద్దకొడప్‌గల్‌లో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏవో నదీమ్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): వరి ధాన్యం 17 శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టి తీసుకురావాలని ఏవో నదీమ్ రైతులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని సూచించారు.

నిజాంసాగర్(జుక్కల్): వరిధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత విక్రయానికి తీసుకురావాలని అచ్చంపేట క్లస్టర్ ఏఈవో స్వర్ణలత అన్నారు. బుధవారం గోర్గల్ గ్రామ కొనుగోలు కేంద్రం వద్ద వరిధాన్యంలో తేమ శాతాన్ని ఆమె పరిశీలించారు.

బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడికి మాతృవియోగం

భిక్కనూరు: కామారెడ్డి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గజ్జెల భిక్షపతికి బుధవారం మాతృవియోగం కలిగింది. భిక్షపతి తల్లి మల్లవ్వ (70) బుధవారం వేకువ జామున మండల కేంద్రంలో మృతి చెందింది. ఈ విషయమ తెలుసుకున్న కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అతిమాముల శ్రీధర్, పబ్లిక్ ప్రాసీక్యూటర్‌లు రాజగోపాల్‌గౌడ్, నంద రమేష్, ఎస్. దామోదర్‌రెడ్డి, తదితరులు నివాళులర్పించి భిక్షపతిని ఓదార్చారు.

మొక్కల రక్షణకు చర్యలు చేపట్టాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వైకుంఠధామాలలో నాటిన మొక్కలను సంరక్షించేలా చర్యలు చేపట్టాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. చీనూర్, రాఘవపల్లి వైకుంఠధామాలలో నాటిన మొక్కల సంరక్షణ తీరును బుధవారం ఆయన పరిశీలించారు. పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు సరేందర్, కృష్ణమూర్తి, భూమేశ్వర్ ఉన్నారు.